వెంకటరంగం గబగబా టేబిల్ దగ్గరకు వెళ్ళి సొరుగులో ఉన్న ఫోటోను బయటకు తీశాడు. కళ్ళు పెద్దవి చేసి తనివితీరా ఒక్కసారి చూసు కున్నాడు. ఎంత బావున్నది ఫోటో! సరిగా 25 ఏళ్ళ యువకుడి ఫోటోలా ఉన్నది అనుకున్నాడు. కాని, వెంటనే ఒక నిమిషం క్రితం అద్దంలో కన్పించిన తన ప్రతిబింబం గుర్తొచ్చింది. గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్లు బాధపడ్డాడు వెంకటరంగం.

అప్పటికీ ఇప్పటికీ రూపంలో భేదం యెంతో లేదు. అప్పుడు జుట్టంతా నల్లగా ఉండేది. యిప్పుడు అక్కడక్కడ కొంచెం తెల్లబడ్డది. నున్నగావుండే బుగ్గలు కొంచెం చప్పబడ్డాయి. కుడిపక్కన రెండు దంతాలు లేకపోవటంవల్ల ఇంకొంచెం లోతుకుపోయాయి బుగ్గలు. ఆ రెండు దంతాలూ కట్టించుకుంటే సరిపోను. ఆ పెద్దకళ్లు ఏమీ చిన్నవికాలేదు కాకపోతే కళ్ళ చుట్టూ కొంచెం ముడతలు పడ్డాయి. చూపులోని చురుకుదనం, కళా తగ్గింది. దానికి కారణం తన నిరాశ, బరువుతో కూడిన జీవితమే. తన భార్య పోయి నప్పటినుంచీ తన ఆనందం, చూపుల్లోని చురుకుదనం తగ్గింది. మళ్ళీ జీవితం లోని ఆనందంతో పాటు అవి మాత్రం ఎంతలోకి వస్తాయి? తను ఆ ఫోటోనే పంపుతాడు. వాళ్ళకు తప్పకుండా అది నచ్చుతుంది. నచ్చటమేమిటి? ఆ పిల్లదాన్ని హృదయానికి హత్తుకుంటూ నిముషం ఒక యుగంగా గడపదా!

తను మర్చిపోయాడు! ఆ పిల్ల వయస్సెంతన్నారు? యిరవై అయిదా? తనకంటే యెంత చిన్నది? తను మహా అయితే ఆమెకంటే పదహారు పది హేడేళ్ళు పెద్దయి ఉంటాడు. అదేమంత చెప్పుకోతగ్గ పెద్ద వయస్సు కాదు! తన నాయనమ్మ చెబుతూండేది. "మగవాడి వయస్సేమిటిరా నాయనా? మా కాలంనాడు ముప్ఫయి యేళ్ల మగవాడికి మూడేళ్ల పిల్లని ఇచ్చి పెళ్ళి చేసేవారు. పెళ్లి నాటికి నాకు యేడేళ్ళు. అప్పటికి మీ తాతకు ముప్ఫయి దాటి రెండేళ్ళకు యెక్కువే అయిందట" నిజంగా యీ ముసలివాళ్ళు చెప్పే మాటల్లో యెంత అనుభవం, యెంత సత్యం ఇమిడి ఉంటాయి. తను కుర్ర తనంలో వాళ్ళ మాటలను యెగతాళి చేసేవాడు. కాని యిప్పుడిప్పుడు అర్థ మవుతోంది, వాళ్ళ మాటల్లోని ~~[illegible]~~ సత్యం.

అయినా పక్కింటి సుబ్బారావును చూడరాదూ! మొన్ననే రెండవ పెళ్ళి చేసుకున్నాడు. ఆ పిల్లకు ఇరవైకంటే ఎక్కువ వయస్సు ఉండదు

